# తెలంగాణ చౌరస్తా
వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

సంపుటి: 01
సంచిక:16

24 క్యారెట్లు 101,215.00 | కిలో వెండి 1,18,850.00 | tcnewsdaily | 09.08.2025 శనివారం, హైదరాబాద్







# కవిత,హరీష్ రావు ఫోన్లు ట్యాప్





## భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు

- ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి
- కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారు
- విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగలేదు
- సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని, అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని ధ్వజమెత్తారు. 2లో

## బండి సంజయ్‌ను కోర్టుకు లాగుతా

- థర్డ్‌క్లాస్ ఆరోపణలు బండికి అలవాటు
- బాధ్యతగల పదవిలో బేస్‌లెస్ ఆరోపణలు
- ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదు
- చీప్ పబ్లిసిటీ కోసం వీధి నాటకాలు ఆడుతున్నాడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



## దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన

- ఉపరితల ఆవర్తనంతో 4 రోజులు వానలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలుదంచికొట్టనున్నాయని పేర్కొంది. నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల 2లో

# రక్షాబంధన్ ఎఫెక్ట్

## ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు

- ఊళ్లకు వెళ్లేవారితో కిటకిటలాడుతున్న బస్ స్టేషన్లు
- రద్దీకి సరిపడలేని బస్సులు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- పలుచోట్ల ముందస్తు రాఖీ పండుగ వేడుకలు
- అన్నాచెల్లెళ్లూ పవిత్ర బాంధవ్యానికి ప్రతీక రాఖీ
- నేడు దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో రాఖీ పండగ సందడి మొదలైంది. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు నగరం నుంచి పెద్ద ఎత్తున అక్కాచెల్లెళ్లు బయల్దేరారు. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. 'రాఖీ స్పెషల్' పేరుతో టీజీఎస్ ఆర్టీసీ స్పెషల్ బస్సు సర్వీసులను అందిస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులు లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వరుస సెలవుతో పాటు రాఖీ పౌర్ణమి పండగ కూడా రావడంతో సొంతూళ్లకు పయనమవుతుండటంతో ప్రయాణికుల ప్రాంగణాలన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తయ్యాయి. దీంతో నేరుగా బస్టాండ్ల వద్దకు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర నిరాశ పడుతున్నారు. అదనంగా మరికొన్ని బస్సులు నడిపించాలని కోరుతున్నారు.మరోవైపు పలు జిల్లా కేంద్రాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. రాఖీ పూర్ణిమకు ఇళ్లకు వెళ్లేందుకు బయలుదేరిన ప్రయాణికులతో కరీనగర్లో ప్రయాణికుల 2లో



## బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసం

- స్పష్టమైన ఆధారాలు లభించాయి
- రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుపై దాడి
- ఎన్నికల కమిషన్ రాజ్యాంగం కోసం పనిచేయాలి.. బీజేపీ కోసం కాదు
- లోక్‌సభ ఎన్నికల్లో భారీగా అవకతవకలు
- మహాదేవపురలో మొత్తం 6.5 లక్షల ఓటర్లు
- అందులో 1.25 లక్షల ఓట్లను దొంగిలించారు :రాహుల్ గాంధీ

2లో

### కేంద్రానికి తమిళనాడు కౌంటర్

## సొంతంగా స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ

- అన్నా సెంటెనరీ లైబ్రరీ ఆడిటోరియంలోఆవిష్కరణ
- ఇంటర్ మార్కుల ఆధారంగా యూజీ ప్రవేశాలు
- తమిళంతో పాటు ఇంగ్లీష్, సైన్స్, ఏఐకి ప్రాధాన్యం
- ఎడ్యుకేషన్ పాలసీ రూపకల్పనకు రిటైర్డ్ జస్టిస్ మురుగేశన్
- హిందీని బలవంతంగా రుద్దాలని కేంద్రం కుట్ర
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

6లో

## లైంగిక సమ్మతికి 18 ఏళ్లు తప్పనిసరి

- అంతకంటే తగ్గిస్తే చాలా ప్రమాదకరం
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

6లో

# ఇందిరమ్మ.. ఇదేందమ్మా..!

- అర్హు లకు మొండి"చేయి"
- అనర్హు లకు అందలం
- నిరుపేదలకు రిక్త"హస్తం"
- కాంగ్రెస్ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత
- అభాసు పాలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం
- జోక్యం చేసుకోని పొన్నం ప్రభాకర్
- మితిమీరిన చోటా లీడర్ల ఆగడాలు
- సైదాపూర్ లో మంత్రి పేరిట అరాచకాలు
- వారికే వత్తాసు పలుకుతున్న అధికారులు
- పట్టించుకోకుంటే పార్టీ అధోగతే
- మంత్రిగారూ.. జర దృష్టి సారించండి





> **రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా** భావించి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అభాసు పాలవుతోంది. ఇందిరమ్మ రాజ్యంలోనైనా సొంతింటి కల నెరవేరుతుందనుకున్న నిరుపేదల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ కార్యకర్తలకు వరంగా మారింది. అర్హులకు దక్కాల్సిన ఇండ్లు అనర్హులకే చెందుతున్నాయి. జాబితాలో హస్తం కార్యకర్తలే మొదటి వరుసలో ఉండడం గమనార్హం. అమ్యామ్యాలకు ఆశపడ్డ అధికారులు ఇక్కడ చోటా లీడర్లకే ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశం. మంత్రి పేరు చెప్పుకొని పబ్బం గడుపుకుంటున్న వారు కొందరైతే... తామే మంత్రి అనుచరులమంటూ విర్రవీగుతూ అరాచకాలకు పాల్పడుతున్న వారు మరికొందరు.. అధికారులు సైతం చేసేదేమీ లేక వారికే వత్తాసు పలకాల్సి వస్తోంది. ఫలితంగా అర్హులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు పక్కదారి పడుతున్నాయి.

**సైదాపూర్ తెలంగాణ చౌరస్తా ;** అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 'అభయ హస్తం' పేరిట ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. అందులో భాగంగా ఈ పథకం కింద లబ్ధిదారులకు నాలుగు దశల్లో నిర్మాణ వ్యయాన్ని అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణ దశల ఆధారంగా.. అధికారుల పరిశీలన అనంతరం ఆధార్ కార్డు ఆధారంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు 2లో

## బండి సంజయ్‌ను కోర్టుకు లాగుతా



తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తూ అన్ని హద్దులు దాటిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. మినిమం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ స్థాయి ఆరోపణలు చేయడం బండి సంజయ్ అలవాటుగా మార్చుకున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాజకీయాల్లో చవకబారు పబ్లిసిటీ కోసం,మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు నిఘా వ్యవస్థల పనితీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత జ్ఞానం కూడా లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బాధ్యత గల పదవిలో ఉండి ఇంత బేస్‌లెస్ ఆరోపణలు చేయడం ఆయన అజ్ఞానం, నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. "కేంద్ర మంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని బండి సంజయ్ ఇప్పటికైనా గ్రహించాలి" అని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన ప్రతిసారి బండి సంజయ్ మరింత దిగజారుతున్నారని, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. "రాజకీయాల్లో పెద్ద జోకర్‌గా మారిన బండి సంజయ్ మీడియా హెడ్‌లైన్ల కోసం, చీప్ పబ్లిసిటీ కోసం, వీధి నాటకాలు ఆడుతున్నాడు" అని ఘాటుగా విమర్శించారు.

బండి సంజయ్ ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. తక్షణమే ఆ ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల పైన లీగల్ నోటీసు పంపిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ డిమాండ్‌ను పట్టించుకోకపోతే, 48 గంటల గడువు తర్వాత కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ అనే అంశం ఎంత సున్నితమైనదో, చట్టపరంగా ఎంత కఠినమైనదో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలవకుండానే, కావాలనే వాస్తవాలను వక్రీకరిస్తూ, సాక్ష్యం లేకుండా ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. "తప్పుడు ఆరోపణలు, బజారు స్థాయి మాటలు, చవకబారు పబ్లిసిటీ కోసం చెప్పే అబద్ధాలు - ఇవన్నీ బండి సంజయ్ కు అలవాటు అయిన రాజకీయాలని, ఇక పైన ఇలాంటి చౌకబారు ఆరోపణలను సహించేది లేదని కేటీఆర్ ఘాటుగా హెచ్చరించారు.

## కవిత,హరీష్ రావు ఫోన్లు ట్యాప్

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా తన ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారని కేంద్రమంత్రి బండి సంజయ్ వివరించారు. తన కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారని మండిపడ్డారు. తన వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చినట్లుగా తెలిపారు. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలని, కానీ, ఆ జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్న బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది తానేనని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లని అన్నారు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ వివరించారు.

కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారని వారినీ విచారణకు పిలవాలి అని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారని మండిపడ్డారు. నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారని బండి సంజయ్ అన్నారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారని ఆరోపించారు. ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు బాగోతం చెబుతుంటే తనకే సిగ్గనిపించిందన్నారు. వారిద్దర్నీ సమాజం క్షమించదని, ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారని, క్షణక్షణం బాధపడాలన్నారు. తమ కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురిచేశారని వివరించారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు పట్టుకున్నారని గుర్తుచేశారు. ఆ డబ్బు ఏమైందో తెలియదని చాలా మంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు సీజ్ చేసి పట్టుకున్నారన్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారని సంజయ్ ఆరోపించారు. రూ.20 కోట్లు దొరికితే కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు అవుతాయన్నారు.

రూ.వేల కోట్లు అక్రమాలు జరిగితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? అని ప్రశ్నించారు. ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుందని సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదని బండి సంజయ్ వివరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతాఅని అన్నారు. ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారని ప్రశ్నించారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారని, నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు అని బండి సంజయ్ ఆక్షేపించారు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదు అని దుయ్యబట్టారు

## ఇందిరమ్మ.. ఇదేందమ్మా..!

తరువాయి భాగం

ఖాతాకు ఆ మొత్తాన్ని విడుదల చేస్తారు.

**ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు..**

స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వనుంది. దీన్ని రాయితీ రూపంలో లబ్ధిదారుడికి అందజేయనుంది. స్థలం లేనివారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అంతే మొత్తాన్ని ఇవ్వనుంది. మొదటి దశలో సొంత స్థలం ఉన్న వారితో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పు (రూఫ్) స్థాయిలో రూ.లక్ష సాయం చేయనుంది. పైకప్పు నిర్మాణం తరువాత రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం అందించనుంది.

**మార్గదర్శకాలు ఇలా...**

లబ్ధిదారుడు విధిగా దారిద్ర్య రేఖ(బిపిఎల్)కు దిగువన ఉన్న వారై ఉండాలి. రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుడిని గుర్తిస్తారు. అర్హులకు సొంత స్థలం ఉండాలి. లేదా ప్రభుత్వం స్థలం ఇచ్చి ఉండాలి. వారు గ్రామం లేదా పురపాలిక పరిధి వారై ఉండాలి. గుడిసె ఉన్నా, గడ్డితో పైకప్పును నిర్మించిన ఇల్లు, మట్టి గోడలతో నిర్మించిన తాత్కాలిక ఇల్లున్నా అర్హులు అవుతారు. అద్దె ఇంట్లో ఉంటున్నా ఈ పథకానికి అర్హత పొందవచ్చు. వివాహమైనా ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నా లబ్ధిదారుడిగా ఎంపిక కావొచ్చు. ఒంటరి మహిళలు కూడా లబ్ధిదారులే. అయితే ఇలాంటి నిబంధనలు సైదాపూర్ మండలంలో ఎక్కడ కూడా అమలు కావడం లేదు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మండలంలో రాజకీయ పలుకుబడి ఉన్న వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయి. మంత్రి పేరు చెప్పుకొని పైరవీలు చేసేవారు.. కనీసం రేషన్ కార్డు కూడా లేని వారు, స్థానికంగా నివాసం ఉండని వారు, కార్లు, సొంత బంగ్లాలు ఉన్న వారు, కొందరు వ్యాపారుల పేర్లు సైతం జాబితాలో దర్శనమివ్వడం గమనార్హం. గ్రామ, వార్డుసభల్లో ఆమోదం పొందిన తరవాత లబ్ధిదారులను కలెక్టర్ ఎంపిక చేయాల్సి ఉండగా ఇక్కడ అలాంటి దాఖలాలు ఏవీ లేవు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో ప్రదర్శించాక సమీక్షించి, ఖరారు చేయాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. ఫలితంగా సైదాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరు పలు విమర్శలకు దారితీస్తోంది.

**మంత్రి దృష్టి సారించాలి..**

హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరుపై దృష్టి సారించాలని సైదాపూర్ మండలానికి చెందిన నిరుపేదలు కోరుతున్నారు. చుట్టపు చూపుగా కాకుండా.. ఒకసారి నియోజకవర్గంలో పర్యటించి తాజా పరిణామాలను అంచనా వేసి పార్టీని చక్కదిద్దాల్సిన అవసరం ఉందని పార్టీ సీనియర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మనగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని.. ఆది నుంచి జెండా మోస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసం

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో:

భారత ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కు పై మీరు దాడిచేస్తే, మీపై మేం దాడి చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత లోక్‌సభ లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంను హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ లో నిర్వహించిన నిరసన సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఇది కేవలం తన గొంతుక కాదని, యావత్ హిందుస్థాన్ గొంతుక అని స్పష్టం చేశారు. ఎన్నికల మోసం ఫిర్యాదుపై తన నుంచి ఈసీ అఫిడవిట్ కోరిందని, కానీ తాను ఇప్పటికే లోక్‌సభలో రాజ్యాంగంపై ప్రమాణం చేశానని రాహుల్ గుర్తుచేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రం 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అని, ఈసీ అధికారులు దానిపైనే దాడి చేస్తున్నారని విమర్శించారు. మీరు పేదలపై దాడి చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఎన్నికల్లో మోసం చేసి సులభంగా తప్పించుకోవచ్చని అనుకుంటే పొరపాటని, సమయం పట్టినా మిమ్మల్ని ఒక్కొక్కరిగా పట్టుకుంటామని రాహుల్ వార్నింగ్ ఇచ్చారు. బెంగళూరు సెంట్రల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఒక్క మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌పై మాత్రమే తాము దృష్టి సారించామని, అక్కడ బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసానికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మహాదేవపురలో మొత్తం 6.5 లక్షల ఓటర్లు ఉంటే, అందులో 1.25 లక్షల ఓట్లను దొంగిలించారని, అంటే ప్రతి ఆరుగురిలో ఒక ఓటును తారుమారు చేశారని రాహుల్‌గాంధీ చెప్పారు. ఈ మోసం ఐదు ప్రధాన పద్ధతుల్లో జరిగిందని ఆరోపించారు.

**ఇవీ రాహుల్ చెప్పిన అక్రమాలు..**

1. సుమారు 12,000 మంది నకిలీ ఓటర్లు ఐదారు పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారు.
2. దాదాపు 40,000 ఓట్లను నకిలీ ఐడీలతో నమోదు చేశారు.
3. ఒకే ఇంటి చిరునామాపై వందల ఓట్లు నమోదు చేశారు. ఒక బీజేపీ నేత ఇంట్లో 40 మంది ఓటర్లు ఉన్నట్లు చూపగా, తాము వెళ్లి చూస్తే అక్కడ ఎవరూ లేరు.
4. దాదాపు 4,000 మంది ఓటర్లకు ఫొటోలు లేవని, ఉన్నా అవి అస్పష్టంగా ఉన్నాయి.
5. ఫారం 6 ద్వారా కొత్తగా చేర్చిన 34 వేల ఓట్లలో చాలామంది 89 నుంచి 95 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

వీటిపై రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ రాజ్యాంగం కోసం పనిచేయాలికానీ బీజేపీ కోసం కాదని హితవు పలికారు. దేశవ్యాప్త ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, పోలింగ్ వీడియో రికార్డింగ్‌లను విడుదల చేస్తే ఈ మోసం కేవలం కర్ణాటకకే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా జరిగిందని నిరూపిస్తామని రాహుల్ సవాల్ విసిరారు. ఈ పోరాటంలో తాను ఒంటరిని కాదని, దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఈ ప్రశ్న లేవనెత్తుతున్నాయని, ఈసీ వెంటనే డేటాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రక్షాబంధన్ ఎఫెక్ట్

తరువాయి భాగం

ప్రాంగణము నిండిపోయింది. రాఖీ పూర్ణిమ సందర్భంగా ఒకటో డిపో నుంచి 440 బస్సులను నడుపుతున్నారు. గోదావరిఖని, మంచిర్యాల వైపు వెళ్లే బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తగినన్ని బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. రక్షాబంధన్ వేడుకలను వరంగల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. రుద్రమాంబ నగర్లోని లిటిల్ మాస్టర్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టగా వారు అక్షింతలు వేస్తూ మనసారా ఆశీర్వచనం చేశారు. అనంతరం రాఖీ పూర్ణిమ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు ఒకరికొకరు తినిపించుకున్నారు. విద్యతోపాటు ఉన్నత విలువలను సంస్కృతి సాంప్రదాయాలను చిన్నప్పటినుండే విద్యార్థులకు తెలియజేసే విధంగా పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ శరత్ బాబు తెలిపారు. రాఖీ పండుగను పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కోరుట్లలోని బాలికల ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి రాఖీపూర్ణిమ వేడుకలు వినూత్నంగా నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్తో ఉగ్రవాదులపై విజయానికి గుర్తుగా దీనిని జరుపుకున్నారు. పలువురు విద్యార్థులు తయారుచేసిన రాఖీని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పోస్టు ద్వారా పంపించారు. రాఖీపై ఆకాష్, బ్రహ్మోస్, రఫేల్, ఎస్ 400 చిత్రాలను ముద్రించారు. మూడు రంగులతో కూడిన రిబ్బెళ్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన చక్కని రాఖీని చూసి పలువురు ప్రశంసించారు. అన్నాచెల్లెళ్లూ, అక్కాతమ్ముళ్ల పవిత్ర బాంధవ్యానికి ప్రతీక రాఖీ పౌర్ణమి లేదా రక్షాబంధన్. భారతీయ కుటుంబ సంబంధ సౌభ్రాతృత్వాల మేలుకలయికే ఈ రాఖీపూర్ణిమ. ఉత్తర భారతంలో విశేషంగా పరివ్యాప్తిలో ఉన్న ఈ పండుగ, క్రమంగా దేశమంతటా విస్తరించింది. శ్రావణ పౌర్ణమినాడు ధరించే రక్షను 'రాఖీగా పిలుస్తుంటారు. తమకి ప్రాణసమానమైనటువంటి సోదరులు కలకాలం సుఖంగా ఉండాలని తమకు రక్షగా నిలవాలని కోరుకుంటూ అక్కాచెల్లెళ్లు ఎంతో ఆప్యాయతతో కట్టేదే రక్షాబంధన్.



## దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన

తరువాయి భాగం

జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల ఇవ్వాళ, రేపు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి.

**హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్లు ఇవే..**

ఎన్డీఆర్ఎఫ్ - 8333068536
ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ - 8712596106
హైడ్రా - 9154170992
ట్రాఫిక్ - 8712660600
సైబరాబాద్ - 8500411111
రాచకొండ - 8712662999
టీజీఎస్పీడీసీఎల్ - 7901530966
టీజీఎస్ఆర్టీసీ - 9444097000
జీహెచ్ఎంసీ - 8125971221
హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ - 9949930003






# పెట్టుబడులకు ఆధునిక ప్రపంచం హైదరాబాద్

- రాష్ట్రంలో భారీగా పెట్టుబడులే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానం
- యంగ్ ఇండియా పాలసీ యువత భవిష్యత్తుకు బలమైన పునాది
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు
- పరిశ్రమలలో నూతన ఉద్యోగాల కల్పనకార్మికుల జీవితాల్లో వెలుగులు..
- కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

రాష్ట్రంలో భారీగా పెట్టుబడులే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానం అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా రుద్రారంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు ముఖ్య అతిథులుగా పాల్గొని, 562 కోట్లతో తోషిబా విద్యుత్ పరికరాల రెండు యూనిట్లను ప్రారంభించి, మరో యూనిట్ కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో భారీగా పెట్టుబడులే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. తోషిబా విద్యుత్ పరికరాల తయారీ పరిశ్రమలో ప్రారంభించిన ఈ యూనిట్ల ద్వారా 400 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆనతి కాలంలోనే తెలంగాణ తయారీ రంగంలో దేశానికి దిక్సూచిగా మారిందనీ అన్నారు. 2024 25 లో ఇండస్ట్రియల్ అవుట్ పుట్ రూ.2.77 లక్షల కోట్లు, ఇందులో 48 శాతం వాటా తయారీ పరిశ్రమ రంగానిదే అన్నారు. 9 నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన మార్చండైజ్ ఎక్స్ పోర్ట్స్ రాష్ట్రం నుంచి జరిగాయనీ, జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం, ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను రెన్యువబుల్స్ ఇంజిన్ ఆఫ్ ఇండియాగా మార్చాలనే సంకల్పంతో క్లీన్ & గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ను తీసుకొచ్చాం అన్నారు. ఇప్పటికే క్లీన్ ఎనర్జీలో రూ. 29వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగాం అన్నారు. 2030 నాటికి న్యూ రెన్యువబుల్ కెపాసిటీని 20వేల మెగా వాట్లకు పెంచేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 2025 ఏప్రిల్ మాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటన సందర్భంగా చేసుకున్న అవగాహన ప్రకారం కొత్త ప్లాంట్ ప్రారంభం అయినదని, రూ.562 కోట్ల పెట్టుబడులకు సంబంధించి తోషిబా కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకుందని చెప్పారు. బుల్లెట్ ట్రైన్ స్పీడ్ తో ఈ రోజు రూ.177 కోట్లతో ఏర్పాటు చేయబోయే ఈహెచ్ వీ పవర్ ట్రాన్స్ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ పనులకు భూమి పూజ నిర్వహించుకున్నాం. రూ.65 కోట్లతో ఏర్పాటు చేసిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ సీ ఆర్ జీవో కోర్ ప్రాసెసింగ్ సెంటర్, రూ.105 కోట్లతో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ సర్జ్ అరెస్టేర్ ను ప్రారంభించుకున్నాం అన్నారు. ఈ పెట్టుబడులతో ఎనర్జీ రంగంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా పాలసీని అమలు చేస్తోందనీ, యువతకు నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ ప్రోత్సాహం, ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందనీ తెలిపారు. పెట్టుబడులకు ఆధునిక ప్రపంచం హైదరాబాద్ అని అన్నారు. టెక్నాలజీ అంటే తెలంగాణ, హైదరాబాద్ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని, ఇది ఒక చరిత్మకమైన ఘట్టం అని తెలిపారు. ఇండియా జపాన్ ల మధ్య ప్రేమ పూర్వక అనుబంధం ఉందనీ గుర్తు చేశారు. తెలంగాణలో నూతన పారిశ్రామిక విధానం అమలు చేస్తున్నామని, అలాగే ఉద్యోగ కల్పనలోనూ తెలంగాణ ముందుందనీ తెలియజేశారు. ఐటీ క్యాపిటల్ గా హైదరాబాద్ ఎదుగుతుందని, రుద్రారంలో ప్రారంభం ద్వారా భవిష్యత్తు విద్యుత్ పరికరాల అవసరం తీరుతాయన్నారు. పాలసీ పర్ఫామెన్స్ లో తెలంగాణ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని, సంగారెడ్డికి రైసింగ్ కారిడార్ గా రుద్రారం మారుతుందని చెప్పారు. దీర్ఘకాళిక సంబంధాల బలోపేతమే లక్షంగా తెలంగాణతో భారీగా పెట్టుబడులు రాబడుతున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ సెక్టర్ కు ప్రోత్సాహం అందిస్తున్నామని, తెలంగాణలో పెట్టుబడులకు జపాన్ కంపెనీలు ఉత్సాహంగా ఉన్నాయన్నారు. విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగానే విద్యుత్ పరికరాల తయారీ కంపెనీలు ఉండాలని ఆకాంక్షించారు. తోషిబా ఈ విషయంలో ముందు వరసలో ఉందన్నారు. స్కిల్ ఇండియా యూనివర్సిటీ, డీట్ లాంటి నూతన ఉద్యోగ, ఉపాధి కేంద్రాలను ప్రారంభించాం అని, తొషిభ కంపెనీ జపాన్ బుల్లెట్ ట్రైన్ కంటే ఫాస్ట్ గా వస్తువులు తయారీ చేస్తుందనీ వివరించారు. టెక్నాలజీలో తోషిబా ఒక ప్రత్యేకమైనదన్నారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... పరిశ్రమలో నూతన ఉద్యోగాల కల్పన ద్వారా కార్మికుల జీవితాల్లో వెలుగులు పంచాలన్నదే తన సంకల్పం అన్నారు. తోసిబాలో ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారని, తద్వారా కార్మికులకు శ్రమ తగ్గుతుందని చెప్పారు. ఈ ప్రాంతానికి పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని పెట్టుబడులకు దారితీయనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, జపాన్ ఎంబసీ ఎకనామిక్ అండ్ డెవలప్మెంట్ మంత్రి క్యోకో హోకాగో, తోషిబా కార్పొరేషన్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ హిరోషి కనేటా, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, సంబంధిర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తోషిబా పరిశ్రమ సిబ్బంది, పాల్గొన్నారు.







## పర్వతాపూర్‌లో ఘనంగా
# పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ

**మేడిపల్లి,తెలంగాణ చౌరస్తా:**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ నందు భక్తి శ్రద్ధల నడుమ శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, జావేద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు, యాసారం శ్రీనివాస్, కిరణ్ గౌడ్, మీసాల కృష్ణ, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, కిరణ్ నాయక్, అమర్ పటేల్, అంజి తదితరులు పాల్గొన్నారు. పోచమ్మ దేవాలయ ప్రాంగణం భక్తుల హర్షధ్వనులతో మార్మోగింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు భగవంతుని ఆశీస్సులు అందుకోవాలని కోరుకున్నారు.



## ప్రణాళిక బద్ధంగా నులిపురుగుల
# నివారణ దినోత్సవాన్ని జరపాలి

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా:**

ఆగస్టు 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని శుక్రవారం మద్దూర్ మండల సమావేశంలో ఎంపిడిఓ రహమతుద్దీన్ పేర్కొన్నారు.అంగన్వాడీ టీచర్లు,ప్రభుత్వ ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు.119సం. పిల్లలకు తప్పకుండా అందేలా చూడాలని,ప్రతి పాఠశాలలో త్రాగునీటి మరియు వసతి కల్పించి ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా నిర్వర్తించాల్సిందిగా కోరారు.అంగన్వాడీ మరియు పాఠశాలల్లో ఈ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకున్న వెంటనే దానికి సంబంధించిన రిపోర్టు పంపవల్సిందిగా ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపిడిఓ రహమతుద్దీన్,ఎంపిఓ రామన్న,ఎంఈఓ బాలకిష్టప్ప,డా.శ్రీలత, ఎంపిహెచ్ఈఓ పి.హన్మంతు,ఎంపిహెచ్ఎస్ కే.ఎస్తేర్ మరియు ఎంపిహెచ్ఏ ప్రేమ్ రాజ్ హాజరయ్యారు.



## పండుగల సాయన్న జయంతిని ప్రభుత్వం
# అధికారంగా నిర్వహించాలి

- బిఎస్ పి కె.వి నరసింహా

**మక్తల్,తెలంగాణ చౌరస్తా:**

మక్తల్ బహుజన సమజ్ పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు కె.వి నరసింహ ఆధ్వర్యంలో ముదిరాజ్ ముద్దుబిడ్డ పండుగల సాయన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. కె.వి నరసింహ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ముద్దుబిడ్డ,యుద్ధ వీరుడు పండుగల సాయన్న అంటూ,రాష్ట్రంలో ఇలాంటి మహనీయుల చరిత్ర కానరాకుండా చేసిన ప్రభుత్వాలు నేటికైనా ఇలాంటి మహనీయుల చరిత్రలు ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పండుగల సాయన్న జయంతి మరియు వర్ధంతిలు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు కె వి నరసింహ,బహుజన సమాజ్ పార్టీ నారాయణపేట జిల్లా కార్యదర్శి బండారి చంద్రశేఖర్,నారాయణపేట జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అమీర్,మక్తల్ అసెంబ్లీ ఇన్ చార్జ్ పాలెం వెంకటయ్య,అసెంబ్లీ ఉపాధ్యక్షుడు పరుశురాం,బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ టౌన్ అధ్యక్షుడు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో చోరీ యత్నంపై
# త్వరగా చర్యలు తీసుకోవాలి

**నాచారం, తెలంగాణ చౌరస్తా:**

నాచారం లోని శ్రీ మహాకాళేశ్వర సహిత మహంకాళి దేవాలయం లో జరిగిన చోరీ యత్నం పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నాచారం బీజేపీ నాయకులు నాచారం పోలీస్ స్టేషన్ సిఐను కలిసి పిర్యాదు చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ చోరికి యత్నించిన దుండగుడిని త్వరగా పట్టుకోవాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొమ్మగల్ల నవీన్ కుమార్, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, బీజేపీ సీనియర్ నాయకులు వై సత్యనారాయణ రావు, రాగిరి మోహన్ రెడ్డి, రవికాంత్, అభిషేక్ గౌడ్, దయాగౌడ్, సాయి గౌడ్, వెంకటేశ్వర్లు, సత్తయ్య నాయుడు పాల్గొన్నారు





## భూగర్భ డ్రైనేజీ పనులను
# పరిశీలించిన కార్పొరేటర్

**నాచారం, తెలంగాణ చౌరస్తా:**

నాచారం డివిజన్ స్నేహపురి కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పర్యవేక్షించారు. చాలా కాలంగా ఉన్న సమస్యను పరిష్కరిస్తున్నందుకు కాలనీవాసులు కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. డ్రైనేజీ నిర్మాణం తరువాత సిమెంటు రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. దానికి కార్పొరేటర్ ప్రతిపాదనలు పంపడం జరిగిందని తొందర్లోనే నిధులు మంజూరు చేయించి రోడ్లు కూడా వేయిస్తామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో డా. కే జే ఎన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, వెంకటస్వామి, భూమయ్య, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మరియు సీవరేజ్ సూపర్వైజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇరిగేషన్ డిఈ



జోగులాంబ గద్వాల, తెలంగాణ చౌరస్తా: అధికారాన్ని అడ్డం పెట్టుకొని లంచాలు తింటున్న ప్రభుత్వ ఉద్యోగుల శాతం పెరిగినట్టు అనిపిస్తుంది.శుక్రవారం ఏసీబీకి అలంపూర్ ఇరిగేషన్ డిఈ శ్రీకాంత్ నాయుడు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటం జరిగింది.యం బుక్ కొలతలు మెజర్మెంట్ చేయడానికి ఒక కాంట్రాక్టర్ దగ్గర నుండి 11,000/ రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికాడు.

# మల్టీపర్పసు వర్కర్ విధానం రద్దు చేయాలి

- జిల్లా అధ్యక్షులు ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్



కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు అంబాల లక్మన్ అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎరవెల్లి ముత్యంరావు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ హాజరై మాట్లాడుతూ.... గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రతినిత్యం గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా,విద్యుత్తు నిర్వహణ,ట్రాక్టర్ నిర్వహణ, డంపింగ్ యార్డ్ నిర్వహణ ప్రభుత్వ పథకాలలో సహకారం అనేక కార్యక్రమాలలో పాల్గొంటున్న డెంగ్యూ మలేరియా కరోనా వంటి విపత్కర పరిస్థితులలో కూడా ప్రజల ప్రాణాలను కాపాడుతూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్న పంచాయతీ కార్మికుల పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్ విధానం పేరుతో చాలా ఇబ్బందులు పెడుతున్నారని, ట్రాక్టర్ మరణాలు, విద్యుత్ స్తంభాల పనుల నిర్వహణలో నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల అనేక కార్మికులు చనిపోయారని,అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం,పండుగ సెలవులు అని లేకుండా, ఉద్యోగ భద్రత,పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు లేవని,ఈ మల్టీ పర్పస్ వర్కర్ విధానం పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి అనేకమార్లు చెప్పిన పెడచెవిన పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల రాబోయే కాలంలో పోరాటాలను ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్,మండల అధ్యక్షులు అంబాల లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డాక్టర్ మంజూర్ హమ్మద్,
- పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి.

నారాయణపేట, తెలంగాణ చౌరస్తా: నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలు,చుట్టుపక్కన ఆవరణమంతా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకొని,ఇంటి దగ్గర ఉన్న డ్రమ్ముల్లో,మిగతా దాంట్లో ఉన్న నీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచన చేశారు.డాక్టర్ మంజూరు హమ్మద్,గ్రామపంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి శుక్రవారం గ్రామంలోని గొల్ల గేరి,బొడ్రా వీధిలో పరిసరాలను పరిశీలించి డ్రైడే & ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలే వర్షాకాలం డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సరస్వతి,ఆశ వర్కర్ కల్పన, అంజమ్మ,బిల్ కలెక్టర్ నరసింహ,పంచాయతీ కార్మికులు కిష్టప్ప,సాయిలు పాల్గొన్నారు.



## పేదల ఆరోగ్యానికి ఆసరగా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందజేత

పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత ఆసరగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన టి. స్వప్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో స్వప్న కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు



మద్దూర్,తెలంగాణ చౌరస్తా: మద్దూర్ మున్సిపాలిటీలోని రెనివట్ల,ఎస్సీ కాలనీలో చిన్న చిన్న వర్షాలకి గుడిసెల్లోకి,ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతుంది. కాస్త చినుకులకే పూర్తిగా ఇంటికి వెళ్లలేని మరియు ఇంట్లో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుంది.మున్సిపల్ కమిషనర్ వచ్చి పరిశీలించి,మా సమస్యను పరిష్కరించాలని ఎస్సీ కాలనీ వాసులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.గుడిసెలో చిన్న చిన్న పిల్లలు కూడా ఉన్నారు. పిల్లలని,ఇక్కడి ప్రజలని దృష్టిలో పెట్టుకొని వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ ను యువరాజ్,మహేష్,కేశప్ప,నర్సమ్మ, రమేశ్,వెంకటేష్,సాయప్పలు కోరారు.



## గాయత్రి విద్యానికేతన్ లో రక్షాబంధన్ వేడుకలు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా: పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.ఈ వేడుకలో పాఠశాల విద్యార్థినీలు అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీకగా విద్యార్థులకు రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటారు.ఈ సందర్భంగా గాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లంకి రజిని శ్రీనివాస్ మాట్లాడుతూ...రాకి రక్షాబంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారని అన్నకు గాని తమ్మునికి గాని ప్రేమ సూచికంగా సోదరి రాఖీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం అన్నారు.నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్ష అని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయినీలు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి తమ అనురాగాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ ప్రిన్సిపల్ విజయ్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.





## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ఘరానా మోసం

- 30 మంది నుంచి రూ.లక్ష చొప్పున వసూల్
- 2 ఏళ్లుగా రేపు, మాపు అంటూ దాటవేత
- నాగరాజు ఇంటిముందు బాధితుల ఆందోళన

మేడిపల్లి, తెలంగాణ చౌరస్తా: మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పీర్జాదిగూడలో నివసించే వెలిశెట్టి నాగరాజు తాను డబుల్ బెడ్రూం కాంట్రా క్టర్ను అని, పొలిటికల్ లీడర్లు అంతా తెలుసని నమ్మబలికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని ఘరానా మోసం చేశాడు. ప్రతాప్ సింగారంలో 2 ఏళ్ల క్రితం ఒక్కొక్కరి నుండి రూ.లక్ష చొప్పున సుమారు 30 మంది దగ్గర వసూలు చేశాడు. అప్పటి నుండి నాగరాజు బాధితులకు మాయమాటలు చెబుతూ అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బు తిరిగి ఇవ్వ మని కోరడంతో నాగరాజు బాధితులకు కనిపించకుండా తిరుగుతున్నాడు. కాగా, శుక్రవారం బాధితులు నాగరాజు ఇంటివద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.



## యూనివర్సల్ ఐఐటి పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్ శ్యామ్ దాస్ నగర్ గ్రామపంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ ఐఐటినీట్ ఫౌండేషన్ హైస్కూల్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు సోదరప్రేమకు అతీతంగా రాఖీలు కట్టి స్వీట్స్ తినిపించి బహుమతులు ఇచ్చి వారికి పాదాభివందనం చేసి వారి అమూల్యమైన ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ....అన్న చెల్లెల అనుబంధాన్ని వివరిస్తూ, పండుగల ప్రాముఖ్యతను తెలియజేశారు.ప్రతీ పండుగను సామూహికంగా జరుపుకోవాలని తెలిపారు.పాఠశాల ప్రాంగణమంతా ఆనందశోభలు వెల్లివిరిసాయి.



## చాణక్య స్కూల్ లో రక్షాబంధన్ వేడుకలు

మానకొండూర్, తెలంగాణ చౌరస్తా: చాణక్య హై స్కూల్ లో రక్షాబంధన్ వేడుకలు మండల కేంద్రంలోని చాణక్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ ఆడెపు రవీందర్ రక్షాబంధన్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తర్వాత నీవు నాకు రక్ష నేను నీకు రక్ష అని విద్యార్థులచే రక్షలు కట్టించారు.రక్షాబంధనం అనేది విద్యార్థులలో నైతిక విలువలను ఒక క్రమశిక్షణను ప్రేమాభిమానాలను పెంచే ఒక గొప్ప పండుగ అని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడాలి



- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:** దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారని రాజ్యాంగబద్ధ సంస్థలు తమ స్వతంత్రతను కాపాడుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ....సర్ ఏకపక్షంగా ఉందని,వయోజన ఓటు హక్కు సార్వత్రిక హక్కును ఉల్లంఘిస్తుందన్నారు.ఆధార్ రేషన్ కార్డులు వంటి సూచికలను మినహాయించి తల్లిదండ్రుల గుర్తింపును తప్పనిసరి చేయడం అవివేకం అన్నారు. బీహార్లో పేదరికం వలసల రేటు ఎక్కువగా ఉండటం వల్ల లక్షలాదిమంది తమ హక్కులను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా సర్ విస్తరించాలని చూస్తూ, ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న ఈ దాడిని ఎంత మాత్రం అనుమతించరాదన్నారు. ఎన్ డి ఏ కూటమి భాగస్వామ్యంలో టిడిపి వంటి పార్టీలు సర్ గురించి తమ అభ్యంతరాలు,ఆందోళనలు వ్యక్తం చేశాయని గుర్తు చేశారు.ప్రజాస్వామ్య విరుద్ధమైన ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ప్రగతి శీలశక్తులు,ఉద్యమించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి,గుడికందుల సత్యం,జి బీమా సాహెబ్,జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్,నాయకులు శనిగరపు రజనీకాంత్, తిప్పారపు సురేష్,జి తిరుపతి నాయక్,గజ్జల శ్రీకాంత్, శివరాజ్,కనకరాజు,సాగర్, అరవింద్, వినయ్ సాగర్, సందేశ్,కండె రాజు,లక్కీ తదితరులు పాల్గొన్నారు.




## అల్ఫోర్స్ జీనియస్ స్కూల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

**హుజూరాబాద్,తెలంగాణ చౌరస్తా:** హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్ లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలతోపాటు వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టి సోదర, సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ,పరస్పర రక్షణ భావాన్ని చాటారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా బాలికలు సాంప్రదాయ వస్త్రధారణలో లక్ష్మి,అమ్మవారి వేషధారణలో పాల్గొని పూజా కార్యక్రమాలు చేశారు.ఈ వేడుకల ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి,సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగించేలా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాఖీ పండుగని తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఘనంగానిర్వహించుకుంటామని,తన పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు సోదరి సోదర భావం కలిగేలా క్రమశిక్షణతో మెలుగుతారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## 104 ఉద్యోగులకు కంటిన్యూయేషన్ ఆర్డర్లు ఇవ్వాలని వినతి

**హుజూరాబాద్, తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు 104 ఉద్యోగులకు కంటిన్యూయేషన్ ఆర్డర్లు ఇవ్వాలని కోరుతూ హుజూరాబాద్ డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చందు కు 104 ఉద్యోగులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఏప్రిల్ 2025 నుండి ఎలాంటి కంటిన్యూషన్ ఆర్డర్లు ఇవ్వడం లేదని, అప్పటి నుంచి జీతాలు అందడం లేదని అన్నారు.జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు.కొందరికి మాత్రమే కొనసాగింపు ఉత్తర్వులు వచ్చాయని అన్నారు. మిగిలిన వారందరికీ వెంటనే కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజీరు, చంద్రశేఖర్, రమేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



## శ్రీలలితా త్రిపుర సుందరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

- కనీస సౌకర్యాల కల్పనలో పలు పంచుకోవాలని భక్తులను కోరిన అర్చకులు

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:** ఇందిరానగర్ గ్రామ పంచాయితీ పరిధిలో కొలువుతీరిన శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి ఆలయంలో వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని వందలాది మంది భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి ఆలయంలో శివుడు, గణపతి,సుబ్రమణ్యస్వామి,జోడి నాగేంద్ర స్వామి ,అనుసంధాన దేవత మూర్తులు కొలువైవున్నాయి.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రేవూరి కళ్యాణ్ రామ్ శర్మ మాట్లాడుతూ... దినదినం భక్తుల రద్దీ పెరుగుతుందని,భక్తులు ముడుపులు కట్టి అమ్మవారిని కోరుకున్న కోరికలను ఆ జగన్మాత తీరుస్తుందని, ఆలయంలో ప్రతి శుక్రవారం అన్నదానం,కుంకుమ అర్చనలు,అక్షరఅభ్యాసాలు,అమ్మవారి పారాయణం లాంటి కార్యాలు నిత్యం జరుగుతున్నాయని తెలిపారు.ఆలయం నిర్మించి 12 సంవత్సరాలు అవుతుందని, ఆలయ స్థల దాత ముక్క బుచ్చి మల్లయ్య వారి కుటుంబం దేవాలయ నిర్మాణానికి 20 గుంటల స్థలాన్ని దానం చేశారని ,ఆలయ నిర్మాణం రేవూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు.నిత్యం భక్తజనం పెరుగుతుండడంతో భక్తులకు కనీసం సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని, ఆలయంలో ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహిస్తుండడంతో వంట గదులు,స్టోర్ రూమ్,ఆలయ పూజారికి గది,బోర్,ఆలయం వెనుకాల షెడ్డు నిర్మాణంకు ఆలయ అభివృద్ధికి భక్తుల నుంచి ఆ జగన్మాత సహాయాన్ని కోరుతుందని తెలిపారు. కనీసం అర్చకులకు ఎలాంటి జీతభత్యాలు లేకుండా గుడిని నమ్ముకొని ఆ జగన్మాత సేవలోనే తమ జీవనం కొనసాగుతుందని భార్య పిల్లలతో కిరాయి వుంటూ అమ్మవారి సేవలు చేస్తున్నామని తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు,వ్యాపార వేత్తలు, భక్తులు,అమ్మవారి ఆలయ అభివృద్ధిలో పలు పంచుకోవాలని,అమ్మవారి కరుణ కటాక్షం సదా భక్తజనం పై ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు కళ్యాణ్ రామ్ శర్మ కోరారు.




## సైబర్ మోసాలు,మాదకద్రవ్యాల పట్ల అవగాహన సదస్సు

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:** జమ్మికుంట పట్టణ పరిధిలో సిపి ఉత్తర్వుల మేరకు మడిపల్లి గ్రామంలో కమ్యూనిటీ కౌంటింగ్ కార్యక్రమం చేపట్టి ఇందులో భాగంగా జాగిలాలతో మడిపల్లి గ్రామం మొత్తం పరిశీలిస్తూ ఈ రోజుల్లో ఎక్కువగా జరుగుతున్న సైబర్ మోసాలు,యువత ఎక్కువగా బానిసలు అవుతున్న మాదకద్రవ్యాలు,మహిళలకు రక్షణ తదితర విషయాల పై జమ్మికుంట పట్టణ ప్రజలకు అవగాహనను కల్పించడం జరిగిందని,ఇందులోనే భాగంగా ఎలాంటి ఆధారిత పత్రాలు లేనటువంటి 59 ద్విచక్ర వాహనాలను,ఒక ట్రాక్టర్ను సీజ్ చేయడం జరిగిందని వాహనాల పై గల పెండింగ్ చలాన్ లను 11145/ రూపాయలను కట్టించడం జరిగిందని పోలీసులు తెలిపారు.



## శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి పండుగ వేడుకలు

**మంచిర్యాల,తెలంగాణ చౌరస్తా:** మంచిర్యాల పట్టణంలోని గల శ్రీచైతన్య పాఠశాలల్లో ఘనంగా వరలక్ష్మి పూజ, రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను, పూజా విధానం గురించి ఏ.జి.ఎం అరవింద్ రెడ్డి ఎంతో కొనియాడారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ్ మాట్లాడుతూ రక్షబంధన్ అనేది అన్న చెల్లెలు, అక్క తమ్ముళ్ళ బంధానికి ప్రతీకగా జరుపుకొనే గొప్ప పండుగ కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ నాగరాజ, డీన్ రవికుమార్, ప్రైమరీ ఇంచార్జీలు విలాస్, జోనల్ పిఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.పాఠశాల చైర్మేన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.




## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్

**ఖమ్మం,తెలంగాణ చౌరస్తా:** పిడిఎస్ యు ముఖ్య కార్యకర్తల సమావేశం ఖమ్మం నగరంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా పిడిఎస్ యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ పాల్గొని మాట్లాడుతూ. రాష్ట్రంలో అధికారాలకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 19 నెలలు కావస్తున్న ఇంతవరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా ఉన్న పరిస్థితి కనపడుతోందని, పేద విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కల్లూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు అన్నం తిని 30 మంది ఫుడ్ పాయిజన్ అయిందని అధికారులు నిర్లక్ష్యపు వైఖరి కనబడుతుందని అన్నారు.ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్స్, గురుకులాలు,డీడీలు, ఆర్సివోలు పరిరక్షణ చేయాలని కోరారు.ఎస్ఆర్ఎన్ బిజిఎన్ ఆర్ డిగ్రీ కళాశాలకు, పీజీ కళాశాలకు బాయ్స్ అండ్ గర్ల్స్ జనరల్ హాస్టల్ ను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు గాంధీ,అజయ్, నాగార్జున,శ్రీకాంత్, శ్రావణ్ పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షునిగా పల్లె సతీష్



**హుజూరాబాద్, తెలంగాణ చౌరస్తా:** సమాచార హక్కు చట్టం హుజూరాబాద్ మండల అధ్యక్షునిగా పెద్దపాపయ్య పల్లె గ్రామానికి చెందిన పల్లె సతీష్ నీ నియమిస్తూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా పల్లె సతీష్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం కమిటీ విధానాలను పటిష్ఠం చేయడంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ,తన పూర్తి సేవను అంకిత భావంతో చేస్తానని తెలిపారు.సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ కి,రాష్ట్ర అధ్యక్షులు సురా స్రవంతికి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.




## రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంటుకు బయలుదేరిన భవన్స్ విద్యార్థులు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తుని ప్రాంతంలో గల పక్కాయరావు పేటలో శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ పాఠశాలలో ఆగస్టు 9 నుండి 11వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ సీబీఎస్సీ క్లస్టర్ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడా టోర్నమెంటులో పాల్గొనేందుకు రామచంద్రాపురంలోని భెల్ టౌన్షిప్ లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం బయలుదేరారు. గర్ల్స్, బాయ్స్ అండర్ 14 మరియు అండర్ 17 కేటగిరీలో భవన్స్ విద్యార్థులు సుమారు 39 మంది పాల్గొననున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సీబీఎస్సి సౌత్ జోన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ మెగా టోర్నమెంట్లో పాల్గొననున్నారు. భవన్స్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపి పాఠశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు ప్రిన్సిపల్ ఉమా శాస్త్రి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులతో పాటు టోర్నమెంటుకు పిఈటిలు సందీప్ రెడ్డి, హారిక బయలుదేరి వెళ్లారు.





# ఓయూ వస్త్ర పరిశ్రమలో పుప్పొడి కి పేటెంట్

వినూత్న పరిశోధన కి దక్కిన అరుదైన గౌరవం..

**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా:-** వస్త్ర పరిశ్రమలో పుప్పొడి మూలాంశాలను ఏకీకృతం చేసే వినూత్న పద్ధతికి పేటెంట్ మంజూర్ అయ్యింది.

ఈ మేరకు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం అధికారిక ప్రకటన వెల్లడించినట్లు ఓయూ పి ఆర్ ఓ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. శివానీ చిలుకురి,డాక్టర్ ఎ.విజయ భాస్కర్ రెడ్డి సంచలనాత్మక ఆవిష్కరణ కు గాను ఈ గౌరవం దక్కింది. వస్త్ర పరిశ్రమలో పుప్పొడి మూలాంశాలను ఏకీకృతం చేయడానికి పరాగమంజారి పద్ధతిని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బోటనీ విభాగంలో పాలినాలజీ అండ్ ప్లాంట్ సిస్టమాటిక్స్ లాబొరేటరీలో జరిగింది.ఈ నూతన ఆవిష్కరణకు గాను 13 సెప్టెంబర్ 2024న పేటెంట్ కోసం దరఖాస్తు వీరు దరఖాస్తు చేయగా, ఈ నెల 07న అధికారిక మంజూరును అందుకుంది. కేవలం 11 నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేసుకుని పేటెంట్ దక్కించుకోవటం విశేషం. ఆవిష్కరణ కొత్తదనం, శాస్త్రీయ యోగ్యత, పారిశ్రామిక సంభావ్యతకు నిదర్శనం. పరాగ మంజారి పద్ధతి అనేది ఒక వినూత్న విధానం, ఇది పాలినాలజీపుప్పొడి ధాన్యాల అధ్యయనం సంక్లిష్టమైన పుప్పొడిఆధారిత మూలాంశాలను వస్త్ర డిజైన్లలో చేర్చడానికి , బొటానికల్ సైన్స్ ను వస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో విలీనం చేయడం ద్వారా ఈ పద్ధతి స్థిరమైన, ప్రకృతిప్రేరేపిత ఫ్యాషన్, ఫాబ్రిక్ సౌందర్యం కోసం కొత్త ఆవిష్కరణాలకు మార్గం చూపింది.ఈ సందర్భంగా పేటెంట్ సాధించిన పరిశోధకులు మాట్లాడుతూ పేటెంట్ గ్రాంట్ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన శక్తిని,పారిశ్రామిక రూపకల్పనను సుసంపన్నం చేయడానికి జీవసంబంధమైన కళారూపాల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ పద్ధతి సైన్స్,సృజనాత్మకతను మరింత ఎత్తుకు తీసుకెళ్లటమే గాక,భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన,బయో ప్రేరేపిత వస్త్ర ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు.ఈ మైలురాయి ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క అత్యాధునిక పరిశోధనలకు నిరంతర సహకారాన్ని,సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక పరిశ్రమ అవసరాలతో అనుసంధానించే ఆవిష్కరణలను పెంపొందించడానికి ఉపయోగ పడుతుందని అన్నారు.




# సన్‌షైన్ స్కూల్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** సోదర సోదరీల బంధాన్ని గుర్తుచేసే రాఖీ పండుగను విద్యార్థులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో గల సన్‌షైన్ లెర్నింగ్ స్కూల్ లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఎంతో ఉత్సాహభరితంగా, హర్షోల్లాసంగా నిర్వహించబడ్డాయి.భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగిన అన్నా చెల్లెలు మధ్య బంధాన్ని ప్రతిబింబించే ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ సయ్యద్ నసీర్ మాట్లాడుతూ...రాఖీ పండుగకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. రాఖీ కేవలం ఒక నూలు కాదు...అది ప్రేమ, భద్రత, గౌరవం,బాధ్యతలకు సంకేతం అని,ప్రతి సోదరుడు తన చెల్లెల్ని రక్షించే బాధ్యతను గుర్తుంచుకోవాలని,ప్రతి చెల్లెలు తన అన్నకు ప్రేమను, విశ్వాసాన్ని కలిగించే బంధాన్ని నిలుపుకోవాలని తెలిపారు. ఇటువంటి పర్వదినాలు పిల్లల్లో భావోద్వేగాలను, సంస్కారాలను పెంపొందిస్తాయని తెలియజేశారు.




విద్యార్థులలో నైతిక విలువలు,భారతీయ సంప్రదాయాల పై అవగాహన కల్పిస్తూ,భవిష్యత్తు పౌరులను చక్కగా తీర్చిదిద్దడంలో సన్ షైన్ పాఠశాల ముందుంటోందని తెలిపారు.విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరై,ఒక్కరికి ఒక్కరు రాఖీలు కట్టి పరస్పరంగా తమ అనుబంధాన్ని. వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం నిహారిక,నరేష్,మమత, అంజుం,శ్రీలక్షిత,సుప్రియా, జోష్ణ,జెస్సి,శ్రీజ, సుమలత,లత తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.







# 'కిర్బీ' లో వరుసగా నాలుగోసారి సిఐటియు విజయం

- బిఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుపై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు గెలుపు
- పరిశ్రమ కార్మికుల భారీ విజయోత్సవ ర్యాలీ, సంబరాలు
- ఎన్ని ఎత్తులు వేసినా.. పై ఎత్తు ఎర్రజెండాదే
- ఈ విజయం కిర్బీ కార్మికులకు అంకితం
- కిర్బీ యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:** పటాన్ చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బీ పరిశ్రమలో గురువారం జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిఐటియు నాలుగోసారి విజయ దుందుభి మోగించింది. సిఐటియు తరపున సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, బిఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు బరిలో నిలిచారు. పరిశ్రమలో మొత్తం 578 ఓట్లకు గాను 576 ఓట్లు పోలవగా 2 ఓట్లు చెల్లలేవు, సీఐటీయూకి 295, బిఆర్టీయూ కూటమికి 281 ఓట్లు రాగా 14 ఓట్ల తేడాతో బిఆర్టియూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుపై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు విజయం సాధించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో కార్మికులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఐటియు ఎర్రజెండాను వరుసగా నాలుగోసారి గెలిపించిన కిర్బీ కార్మికులకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నట్లు చెప్పారు. సిఐటియు గెలుపుతో కార్మికుల జీవితాలు బాగుపడతాయని, నమ్మిన కార్మికులకు భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు, హక్కులను సాధించేందుకు ఈ గెలుపు దోహదపడుతుందని చెప్పారు. సిఐటియుతోనే కార్మికులకు రక్షణ ఉంటుందన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలన్నిటిని రాబోయే రోజుల్లో నెరవేర్చే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్ని యూనియన్లు కూటములుగా ఏర్పడిన, ఎన్ని ఎత్తులు వేసినప్పటికీ ఎర్రజెండాదే విజయమన్నారు. ఈ గెలుపు కార్మికుల విజయంగా ఆయన అభివర్ణించారు. సీఐటీయును కార్మికులు ఆదరించి నాలుగవ సారి విజయం అందించినందుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కే.రాజయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.మల్లేశం, పాశమైలారం పారిశ్రామిక వాడ క్లస్టర్ కన్వీనర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మానిక్, పి. పాండురంగ రెడ్డి, కిర్బీ యూనియన్ ప్రధాన కార్యదర్శి వివిఎస్ రాజు, యూనియన్ నాయకులు తలారి శ్రీనివాస్, నాగప్రసాద్, రాములు, లకన్, జైపాల్, సోమన్న, ప్రవీణ్, శంకర్, బిలాల్, కార్మికులు పాల్గొన్నారు.

# సొంతంగా స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం సరికొత్త భాషా విధానాన్ని తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం తమ రాష్ట్ర ప్రజల కోసం సొంతంగా రాష్ట్ర విద్యా విధానాన్ని (ఎస్ఈపీ)ని ఆవిష్కరించారు. చెన్నైలోని అన్నా సెంటెనరీ లైబ్రరీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. మాతృభాష తమిళంతో పాటు ఇంగ్లీష్, కృత్రిమ మేధ(ఏఐ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), సైన్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఈ స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని తమిళనాడు రూపొందించింది. కేంద్రం విధానమైన త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరి చేసే జాతీయ విద్యావిధానం అమలు విషయంలో కొంతకాలంగా కేంద్రం, తమిళనాడుల మధ్య వివాదం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. హిందీ భాషను తమపై బలవంతంగా రుద్దాలని కేంద్రం ప్రయత్నిస్తోందని స్టాలిన్ సర్కారు ఆరోపిస్తోంది. మరోవైపు, నీట్ లాంటి ప్రవేశ పరీక్షలను తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఫలితంగా కొత్త విద్యా విధానంలో ప్రవేశపరీక్షకు బదులుగా మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఇవ్వాలని నిర్ణయించారు. 11, 12వ తరగతుల మార్కుల ఆధారంగా ఆర్ట్స్, సైన్స్ వంటి కోర్సుల్లో యూజీ ప్రవేశాలు



కల్పించేలా కొత్త పాలసీలో ప్రతిపాదనలు చేశారు. కాగా, ఈ కొత్త విద్యా విధానం రూపకల్పనకు రిటైర్డ్ జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యుల కమిటీని తమిళనాడు ప్రభుత్వం 2022లో ఏర్పాటు చేసింది. ఈ కమిటీ త్రిభాషా సూత్రాన్ని తిరస్కరించింది. 3, 5, 8 తరగతుల్లో పబ్లిక్ పరీక్షల ప్రతిపాదనను కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. విద్యను ఉమ్మడి జాబితా నుండి రాష్ట్ర జాబితాకు బదిలీ చేయాలని కూడా మురుగేశన్ కమిటీ సిఫారసు చేసింది. కాగా జాతీయ విద్యావిధానం అమలు చేయని కారణంగా సమగ్ర శిక్ష పథకం కింద కేంద్రం రూ. 2,152 కోట్లను నిలిపివేసిందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించింది. దీనిపై స్పందించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్ .. కేంద్రం వెయ్యి కోట్లు ఇచ్చినా, తమిళనాడు ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయదని తేల్చి చెప్పేశారు.

# లైంగిక సమ్మతికి 18 ఏళ్లు తప్పనిసరి

- అంతకంటే తగ్గిస్తే చాలా ప్రమాదకరం
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** లైంగిక చర్యకు సమ్మతి తెలపడానికి 18 ఏళ్లు దాటినవారే అర్హులన్న నియమాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. లైంగిక సమ్మతి వయోపరిమితిని 18 నుంచి 16 సంవత్సరాలకు తగ్గించాలంటూ సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చేసిన వాదనను కేంద్రం తోసిపుచ్చింది. మైనారిటీ తీరని బాలబాలికలను లైంగిక మోసాలు, దోపిడీల నుంచి కాపాడేందుకు ఈ విధానాన్ని ఉద్దేశపూర్వకంగా, బాగా ఆలోచించి అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. యువతీ యువకుల మధ్య శృంగార భరిత ప్రేమ పేరుతో ఈ వయోపరిమితిని, తగ్గించడం లేదా సవరించడం చట్టవ్యతిరేకమేకాక, చాలా ప్రమాదకరం అని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి లిఖిత పూర్వకంగా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. పిల్లల మౌనాన్ని, భావోద్వేగాలను ఆసరాగా చేసుకొని లైంగిక దురాగతాలకు పాల్పడే వారిని ఈ పరిమితి కట్టడి చేస్తుందని ఆమె అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. లైంగిక సమ్మతి వయోపరిమితిని తగ్గిస్తే అదే సాకుగా పిల్లల అక్రమ రవాణా, బాలలపై జరిగే నేరాలు అడ్డూ, అదుపూ లేకుండా పెరిగిపోతాయని ప్రభుత్వం పేర్కొంది. పోక్సో చట్టం కింద లైంగిక కార్యకలాపాలకు సమ్మతి తెలిపే వయసును 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించాలని సుప్రీంకోర్టు



కు అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ విజ్ఞప్తి చేశారు. పోక్సో చట్టం 2012, ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం 1618 ఏళ్ల వయసులో ఉన్నవారి లైంగిక కార్యకలాపాలను పూర్తిగా నేరంగా పరిగణించడాన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రస్తుత చట్టం కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ ప్రేమ సంబంధాలను నేరంగా పరిగణిస్తుందని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తుందని అభిప్రాయపడ్డారు. లైంగిక కార్యకలాపాలకు అంగీకారం తెలిపే వయసు 18 ఏళ్లు పోక్సో చట్టం ప్రకారం, ఇద్దరు వ్యక్తుల మధ్య లైంగిక సంబంధం విషయంలో సమ్మతి వయసుపై కొన్నాళ్ల క్రితం లా కమిషన్ కీలక వ్యాఖ్యలు చేసింది. లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి అంగీకారం తెలిపే కనీస వయసు 18 సంవత్సరాల నుంచి 16 ఏళ్లకు తగ్గించాలనే వాదనను తిరస్కరించింది. పోక్సో చట్టం ప్రకారం ప్రస్తుతమున్న సమ్మతి వయసును మార్చడం అంత మంచిది కాదని పేర్కొంది.

# ఉంటే ఆధారాలివ్వండి.. లేదంటే దేశానికి క్షమాపణ చెప్పాలి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని, అధికార బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీ కి పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలను అర్థం పర్థం లేనివిగా అభివర్ణించింది. రాహుల్‌గాంధీ తన ఆరోపణలకు కట్టుబడి ఉంటే తన సంతకంతో ప్రమాణపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, లేని పక్షంలో దేశానికి క్షమాపణ చెప్పాలని ఎన్నికల సంఘం కౌంటర్ ఇచ్చింది. గురువారం సాయంత్రం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కర్ణాటకలోని ఓ అసెంబ్లీ సెగ్మెంట్‌లో భారీగా ఓట్ల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఒకే ఓటరు పేరు పలుమార్లు నమోదు కావడం, ఇతర రాష్ట్రాల ఓటర్ల జాబితాలోనూ అదే వ్యక్తి పేరు ఉండటం, ఉనికిలో లేని చిరునామాలలో ఓటర్లు ఉండటం, ఒకే ఇంటి నంబర్‌పై వందలాది ఓట్లు ఉండటం, ఫోటోలు సరిగా లేని గుర్తింపు కార్డులు, కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారం6 దుర్వినియోగం లాంటి అనేక అవకతవకలను తాము తమ సర్వేలో గుర్తించామని తన ప్రజెంటేషన్‌లో రాహుల్ వివరించారు. అదే విధంగా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను రూపొందించిందని, డిజిటల్ ఓటర్ల జాబితాను తమకు ఇవ్వడానికి నిరాకరించిందని రాహుల్ ఆరోపించారు.

## అనుష్క ఇబ్బంది పడుతోందా?

సీనియర్ హీరోయిన్ అనుష్క శెట్టి స్టార్ హీరోలతో సమానంగా స్టార్ డమ్ ను సంపాదించింది. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్ లో అనేక పాత్రలతో ప్రేక్షకులను మెప్పించింది. ఆమె అరుంధతి లాంటి సినిమాలో నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అయితే ఇటీవల కాలంలో ఆమె నుంచి యాక్షన్ సినిమాలు రాలేదు. కానీ, తాజా సినిమా ఘాటీతో మళ్లీ యాక్షన్ పాత్రలో కనిపించి కనువిందు చేయనుంది.క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన ఈ సినిమా సెప్టెంబర్ 5న రిలీజ్ కానుంది. తాజాగా సినిమా నుంచి ట్రైలర్ కూడా రిలీజైంది. ఇందులో ఆమె లుక్స్ బాగా వైలెంట్ గా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆమె లుక్స్ పై రకరకాల కామెంట్స్ వస్తున్నాయి. లావైపోయినట్లు కనిపిస్తుందని ట్రోల్స్ వస్తున్నాయి. అయితే అనుష్క ఒకప్పుడు యోగా టీచర్. అలాంటి ఆమె శరీరాన్ని ఫిట్ గా ఉంచుకోవడంలో కష్టపడుతుందని అంటున్నారు. కెరీర్ లో తొలుత యోగా టీచరైన అనుష్క.. సినీ కెరీర్ లో ఎన్నో అద్భుతమైన విజయాలు సాధించింది. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరితోనూ కలిసి పనిచేసింది. అరుంధతి, బాహుబలి సినిమాల్లో ఆమె పాత్రలు హీరోయిన్ గా ఇంకో స్థాయికి తీసుకెళ్లాయి. ఇక వేదంలో ఆమె పోషించిన పాత్రకైతే విమర్శకుల నుంచి సైతం అనుష్క ప్రశంసలు అందుకుంది. కానీ అనూహ్యంగా సైజ్ జీరో సినిమా ఒప్పుకోవడం ఆమె కెరీర్ గతిని పూర్తిగా మార్చివేసింది. ఈ సినిమా కోసం అనుష్క సహజంగానే చాలా బరువు పెరిగింది. మళ్లీ తగ్గించడానికి ఎంతో కష్టపడింది. కఠినమైన ఫిట్‌నెస్ మెయింటెన్ చేసినప్పటికీ, ఆమె ముందటి సైజ్ కు తిరిగి రావడం కష్టంగా మారింది. అయితే సినిమా కోసం బరువు పెరగడం ప్రశంసించదగినదే.. కానీ, ఆ తర్వాత యాథవిధిగా మాత్రం మారడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. బాహుబలి సినిమాల తర్వాత అనుష్క.. భాగమతి, మిస్ శెట్టి-మిస్టర్ పాలిషెట్టి చిత్రాలలో నటించింది. రెండు చిత్రాలలోనూ, అనుష్కను క్లోజ్ షాట్లలో స్లిమ్ గా చూపించడానికి నిర్మాతలు గ్రాఫిక్స్ ను ఉపయోగించారని తెలిసింది. అప్పట్లో దీనిపై విమర్శలు కూడా వచ్చాయి. అనుష్క బయటి ఈవెంట్లకు రాకపోవడానికి ఇది కూడా ఒక కారణం అని టాక్. ఇటీవల బాహుబలి 10ఏళ్ల సెలబ్రేషన్స్ కు కూడా ఆమె బహిరంగంగా కనిపించలేదు. తాజాగా ఘాటి ట్రైలర్‌లో, అనుష్క కు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఆమెను సన్నగా చూపించడానికి సీజీని ఉపయోగించినట్లు కనిపిస్తోంది. దీంతో అభిమానులు కాస్త, నిరాశ చెందారు. మరి సినిమా విడుదలైయ్యాక పరిస్థితులు ఎలా ఉంటాయో ముమ్ముందు చూడాలి!





## కూలీ ఆ రూ.100 కోట్ల రికార్డ్ కొట్టేనా...?

కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ ఫ్యాన్స్‌తో పాటు అన్ని భాషల ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కూలీ' సినిమా మరో ఐదు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ గత సినిమాల ట్రాక్ రికార్డ్ నేపథ్యంలో కూలీ సినిమాకు విపరీతమైన బజ్ క్రియేట్ అయింది. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్‌కి ఉన్న క్రేజ్ నేపథ్యంలో సినిమాకు విపరీతమైన క్రేజ్ క్రియేట్ అయింది. తమిళనాట మాత్రమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో, నార్త్ ఇండియాలోనూ కూలీ సినిమాకు ప్రీ సేల్ ఓ రేంజ్ లో ఉంది అనే విషయం తెల్సిందే. అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభించిన వెంటనే లక్షల మంది బుక్ మై షో లో టికెట్లను బుక్ చేసుకున్నారు.గంటకు ఒకానొక సమయంలో 50 వేల నుంచి 60 వేల వరకు టికెట్లు బుక్ అయ్యాయి. అందుకు సంబంధించిన స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రజనీ గతంలో ఏ సినిమాకు రాని విధంగా ఈ సినిమాకు బజ్ క్రియేట్ కావడంతో ఓపెనింగ్స్ అందుకు తగ్గట్లుగా నమోదు అవుతున్నాయి. ఈ మధ్య కాలంలో ఈ స్థాయిలో ప్రీ సేల్ కావడం ఇదే అంటున్నారు. 2025 లో అత్యధిక ప్రీ సేల్‌ను నమోదు చేసిన సినిమాగా ఇప్పటి వరకు వచ్చిన సినిమాలన్నింటిని వెనక్కు నెట్టి మరీ కూలీ నిలిచింది అక్కడ విడుదలకు ముందే రూ.100 కోట్లు సాధించేనా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విడుదలైన మొదటి రోజు చాలా తక్కువ సినిమాలు మాత్రమే ఓవర్సీస్‌లో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరాయి. ఇప్పుడు రజనీకాంత్ కూలీ సినిమా జోరు చూస్తూ ఉంటే ఖచ్చితంగా బాక్సాఫీస్ ను షేక్ చేయడం ఖాయంగా అనిపిస్తుంది. కూలీ సినిమా ఓవర్సీస్‌లో ఇప్పటి వరకు రూ.30 కోట్ల వరకు ప్రీ సేల్ నమోదు చేసింది. విడుదలకు మరో ఐదు రోజుల సమయం ఉంది. కనుక అప్పటి వరకు మరో పాతిక నుంచి ముప్పై కోట్ల వరకు ప్రీ సేల్ రాబట్టే అవకాశాలు ఉన్నాయి. కూలీ సినిమా విడుదల రోజు నమోదు అయ్యే కలెక్షన్స్ అరుదైన రికార్డ్‌ను నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ కి ఉన్న క్రేజ్ నేపథ్యంలో మొదటి రోజు పూర్తి అయ్యేప్పటికి కేవలం ఓవర్సీస్‌లో రూ.100 కోట్లు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఓవర్సీస్ లో మొదటి రోజు రూ.100 కోట్లు రాబట్టిన సినిమాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఆ సినిమాల జాబితాలో ఇప్పుడు ఈ సినిమా నిలిచే అవకాశం ఉందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో తెలుగు, మలయాళ స్టార్స్ ఉండటంతో ఈ భాషలకు చెందిన ప్రేక్షకులు సైతం ఓవర్సీస్‌లో కూలీ సినిమాను చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు. అందుకే ప్రీ సేల్ అన్ని భాషలకు కలిపి భారీ మొత్తంలో నమోదు అవుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్ ఈ మధ్య కాలంలో బాక్సాఫీస్ వద్ద సరైన సత్తా చాటడంలో విఫలం అవుతున్నారు. జైలర్ తర్వాత ఆయన సినిమాలు నిరాశ పరుస్తూ వస్తున్నాయి. దాంతో ఈ సినిమా విషయంలో ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఉన్నారు. రూ.500 కోట్ల టార్గెట్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ వార్ కి రెడీ అవుతోంది. వార్ 2 సినిమా ఈ సినిమాకు పోటీగా విడుదల కాబోతున్న విషయం తెల్సిందే.



## జోరు పెంచిన శ్రీలీల..

ప్రస్తుతం టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకుంది శ్రీలీల. ఏడాదికి రెండు మూడు సినిమాల్లో కనిపిస్తూ ఇండస్ట్రీ మొత్తాన్ని ఒక ఊపు ఊపేస్తోంది. కేవలం సౌత్ ఇండస్ట్రీని మాత్రమే కాదు నార్త్ ఇండస్ట్రీని కూడా తన మాస్ ఎనర్జీతో కట్టిపడేస్తోంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు సౌత్ ఇండస్ట్రీలో కూడా బిజీగా మారింది. అంతేకాదు ఒకవైపు హీరోయిన్ గా చేస్తూనే.. అదే సినిమాలో స్పెషల్ సాంగులో కూడా చేస్తూ నిర్మాతలకు వరంలా మారిందని చెప్పవచ్చు.వాస్తవానికి చాలామంది నిర్మాతలు సినిమాలు తెరకెక్కించేటప్పుడు.. ఆ సినిమాలో మెయిన్ హీరోయిన్ గా ఒకరిని తీసుకుంటే.. స్పెషల్ సాంగ్ కోసం మరో హీరోయిన్ ని తీసుకుంటారు. అయితే మెయిన్ హీరోయిన్ గా చేసే హీరోయిన్ కి ఎంత రెమ్యూనరేషన్ ఉంటుందో.. కేవలం 4,5 నిమిషాలు ఉండే స్పెషల్ సాంగ్ లో చేసే హీరోయిన్ కు కూడా అంతే రెమ్యూనరేషన్ ఉంటుంది. అయితే ఆ స్పెషల్ సాంగ్ లో కనిపించే హీరోయిన్ కోసం బాగా పాపులారిటీ ఉన్న వారిని.. యూత్లో మంచి క్రేజ్ ఉన్న వారిని మాత్రమే తీసుకుంటారు. పైగా స్పెషల్ సాంగ్స్ కోసం హీరోయిన్స్ ని రంగంలోకి దింపాలంటే దర్శక నిర్మాతలకు కత్తి మీద సాములాగ పరిస్థితి మారిపోయింది. కానీ శ్రీలీల హీరోయిన్ గా చేసే సినిమాల్లో మాత్రం అలాంటి హీరోయిన్ల అవసరమే ఉండదు. ఎందుకంటే శ్రీలీల అటు హీరోయిన్ గా మెప్పించడమే కాదు. ఇటు ఐటెం సాంగ్ తో కూడా అందరినీ ఒక ఊపు ఊపేస్తోంది. ఎందుకంటే ఇప్పటివరకు శ్రీలీల ఓవైపు సినిమాల్లో హీరోయిన్ గా రాణిస్తూనే.. మరోవైపు స్పెషల్ సాంగ్స్ కూడా ఓకే చేస్తూ తన డ్యాన్స్ తో ఆకట్టుకుంటోంది. అలా రవితేజ ధమాకా సినిమాలో పల్సర్ బండి, మహేష్ బాబు గుంటూరు కారంలో కుర్చీ మడతపెట్టి, కిరీటి రెడ్డి జూనియర్ మూవీలో వైరల్ వయ్యారి.. ఇలా ఈ మూడు సినిమాల్లో శ్రీలీల హీరోయిన్ గా చేస్తూనే.. స్పెషల్ సాంగ్ లో కూడా చేసి సెంటరాఫ్ అట్రాక్షన్ అయింది. ఇక శ్రీలీల సినిమాల్లో హీరోయిన్ గా ఉంటే స్పెషల్ సాంగ్ ల కోసం డబ్బులు పెట్టి వేరే హీరోయిన్లను పెట్టుకోవాల్సిన పనిలేదు. శ్రీలీలనే రెండింటినీ కవర్ చేస్తుంది. అలా ఓవైపు ఐటెం సాంగ్స్ తో మెప్పిస్తూనే.. మరోవైపు హీరోయిన్ గా కూడా రాణిస్తోంది. ఒకరకంగా ఈ విషయంలో శ్రీలీల నిర్మాతలకు బంగారు బాతే అని చెప్పకోవచ్చు. శ్రీ లీల ప్రస్తుతం రవితేజతో కలిసి మాస్ జాతర మూవీ చేస్తోంది.ఇప్పటికే వీరి కాంబోలో ధమాకా వచ్చి సూపర్ హిట్ కొట్టింది. మళ్ళీ మాస్ జాతర మూవీతో హిట్ కొట్టబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుండి విడుదలైన తూ మేరీ లవర్, ఓలే ఓలే రెండు సాంగ్స్ కూడా హిట్ టాక్ తెచ్చుకున్నాయి. ఇందులో ఓవైపు మాస్ సాంగ్స్ తో కుర్రకారుని స్టెప్పులు వేయించడమే కాకుండా క్లాసీ లుక్స్ తో అదరగొట్టింది శ్రీలీల.